
वेद

మంగళాచరణము

(సాధు నిశ్చలదాసు)

दा. ना. गुन्नाल

అనువాదము :

శ్రీ రామకృష్ణానంద స్వామి,
శ్రీ భూమానందాశ్రమము,
గండి క్షేత్రము.

1967

పీఠిక

★

శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వాములువారు 1965-వ సంవత్సరం జనవరినెలయందు తెనాలి శ్రీ కుసుమహరనాథ ఆర్తరక్షణ సేవాసంఘమువారు జరిపిన వార్షికోత్సవాలను పురస్కరించుకొని యిరవై రోజులు ప్రతిరోజు ఉదయంపూట విచారసాగర గ్రంథ ప్రవచనము జరిపారు. గ్రంథ కర్తయగు నిశ్చలదాసుగారు గ్రంథారంభంలో చేర్చిన మంగళాచరణ ప్రక్రియనే గురించియే యించుమించు అన్ని రోజుల ప్రవచనమూ జరిగింది. ఆ ప్రవచన స్వరూపమే యీ గ్రంథము.

మా గీతావాణి మాసపత్రిక యందు 1965-వ సంవత్సరము జూలై - ఆగస్టు - సెప్టంబరు - అక్టోబరునెల సంచికలలో యీ రచన వరుసగ ముద్రించబడింది. దాని పునర్ముద్రణమే యీ చిన్న గ్రంథము.

ప్రకాశకులు.

ప్రియమైన ఆత్మబంధువులారా !

మీ పరిశుద్ధ బుద్ధియందు పవిత్రాంతః కరణమునందు సాక్షిస్వరూపంతో విరాజమానమై యుండే పరమాత్మకు వందనాలర్పిస్తూన్నాను. మరియు బ్రహ్మవిద్యా సంప్రదాయ ప్రవర్తకులైన ఋషిపుంగవులకూ సద్గురు పరంపరకూ సభలో సముపస్థితులైన భక్తులకు విరక్తులకు ముక్తులకు ముముక్షువులకు మాన్యులకు మహిళామణులకు శ్రద్ధాంజలులను ధన్యవాదాలను సమర్పిస్తూ నా ప్రవచన కార్యక్రమాన్ని ప్రారంభిస్తూన్నాను.

ఈ వార్షికోత్సవ కార్యనిర్వాహకులు యీ సభకు నన్ను అధ్యక్షునిగా ప్రకటించారు. సర్వ ప్రపంచానికి భగవంతుడే

అధ్యక్షుడు. గీతలో తొమ్మిదవ అధ్యాయం
పదవ శ్లోకంలో భగవంతుడు శ్రీకృష్ణుడు
"మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే స
చరా చరం" — "సర్వ ప్రకృతి నా అధ్య
క్షతతో నే నడుస్తూంది" అంటూ సెల
విచ్చాడు. అలాంటప్పుడు మరొక్క అధ్య
క్షునితో పనేమున్నది. ఒక్క సీటుపై
యిద్దరు యెలా కూర్చోడం! అయినా మీ
రిచ్చిన యీ మర్యాదను భగవంతుడికి
యిచ్చిన మర్యాదేనంటూ నమ్రభావంతో
స్వీకరిస్తూన్నాను.

శ్రీరాముడు రావణాసురుని సంహా
రించి అయోధ్యను చేరుకొన్న తర్వాత
లంకానగరాన్ని విభీషణుడు రాజై పరి
పాలిస్తూన్నాడు. ఒక కోతి హఠాత్తుగ
లంకలో ప్రవేశించింది. లంకానగర

వాసులు ఆ సమాచారాన్ని విభీషణునికి యెరుకపరచారు. ఆ కోతికి ఆంజనేయుని పోలికలు వుండటంబట్టి ఆంజనేయుని వంశీయుడేనని విభీషణ చక్రవర్తి అత్యాదరంతో దానిని మంగళవాద్యాలతో యెదుర్కొని వూరంతా వుత్సవంచేసి సాగనంపాడు. ఆంజనేయుని రూపంతో వుండటంబట్టి కోతికి ఆ సత్కారం జరిగింది. అంతేకాని స్వయంగా దానిని చూచి జరిగిందికాదు. అట్లే మీరు మాకుయిచ్చిన గౌరవం యీ కాషాయ వస్త్రాలకు, సంన్యాస సంప్రదాయానికి, శ్రీశంకరాచార్యుల వారికి యిచ్చిన గౌరవమేకాని స్వయంగా మాకు కాదు. ఈ విధంగా వారికి నమస్కృతులు చెల్లిస్తూ ప్రస్తుతం నా కార్యక్రమాన్ని ఆరంభిస్తూన్నాను.

విచార సాగరమనే గ్రంథం వేదాంత ప్రకరణ గ్రంథం. ఆ గ్రంథ కర్తయైన నిశ్చలదాసుగారి పాదపద్మా లకు భక్తితో ప్రణామాలు సమర్పిస్తూ న్నాను.

విచారంలేని జీవితంకాని వ్యవహారం కాని వ్యభిచారమని చెప్పబడ్తుంది. మానవ జీవితానికి విచారం అత్యావశ్యక మైనది. "సంసార దీర్ఘరోగస్య విచారః పరమౌషధం" — అని వసిష్ఠులవారు శ్రీ రామచంద్రునికి బోధించి వున్నారు. జనన మరణ రూపమైన యీ సంసారమే దీర్ఘ రోగము. ఎప్పటినుండీ వచ్చిందో చెప్ప లేము. ఈ దీర్ఘ రోగానికి ఏది మందు? విచారమే ఔషధము. అది వట్టి ఔషధం కాదు; పరమౌషధము. తిరుగులేని ఔషధ

మని అర్థము. "నాన్యః పంథా అయ నాయ విద్యతే" – వేరే మార్గమే లేదని వేదమాతే చెప్పింది కదా!

విచారమంటే – యేమిటి ఆ విచారం? "నేననగా యెవరు? నే నెక్కడనుండి వచ్చాను? ఎక్కడికి పోవాలె? జగత్త నగా యేమి? జీవుడనగా యేమి? యీశ్వ రుడనగా యేమి? బంధమనగా యేమి? మోక్షమనగా యేమి?" ఈ విధమైన ఆత్మానాత్మ విచారమే విచారమని చెప్ప బడ్తుంది. అంతేకాని మనం తెల్లవారింది మొదలు అస్తమానం వరకు చేసే విచా రాలు విచారాలు కావు; గ్రహచారాలు. తత్త్వవిచారమే విచారమని చెప్పబడ్తుంది.

"బ్రహ్మసత్యం – జగన్మిథ్య – జీవో బ్రహ్మైవ నాపరః" యిది విచారాంతంలో

తేలే సిద్ధాంతం; త్రికాలా బాధ్యమైన బ్రహ్మవస్తువే సత్యము; ఈ దృశ్య జగత్తు స్వప్న జగత్తువలె మిథ్యా మాత్రము. ఉపాధి భేదంతో జీవబ్రహ్మలు భిన్నంగా గోచరించినా చేతనమాత్ర స్వరూపులు కాబట్టి యిద్దరికీ భేదం లేదని జీవబ్రహ్మలు ఒక్కటేనని యీ విచార పర్యవసానంలో అద్వైత సిద్ధాంతం నిర్ధారణ చేయబడ్తుంది. ఆ విచారమే అనేక ప్రక్రియలద్వారా యీ గ్రంథంలో సాగరంలాగా విస్తారంగా నిరూపింపబడింది కాబట్టి సాధు నిశ్చల దాసుగారు యీ గ్రంథానికి విచార సాగర మని నామకరణం చేశారు.

భారతదేశంలో అన్ని మూలలా యీ గ్రంథం బహుళ ప్రచారంలో వుంది. సాధు నిశ్చలదాసుగారు యీ గ్రంథాన్ని ఆనాడు

వ్యాప్తిలోవున్న హిందీ భాషలో వ్రాశారు. తదుపరి అన్ని దేశ భాషలలోనూ తర్జుమా అయింది. మరో విశేషమేమంటే – సంస్కృత భాషలోనికి కూడా యీ గ్రంథం తర్జుమా అయింది. లోకంలో సంస్కృత భాషనుండి దేశ భాషలలోకి అన్ని గ్రంథాలు అనువాద మయ్యాయి. కాని దేశ భాష నుండి దేవ భాషఅయిన సంస్కృతంలోనికి అనువాదమైన గ్రంథాలు చాలా అరుదు. అట్టివానిలో యీ విచార సాగరం ఒకటి.

"మంగళాదీని మంగళ మధ్యాని మంగళాంతాని కార్యాణి ప్రథంతే" – ఆస్తికులమైన మనం యే కార్యక్రమాన్ని ప్రారంభించినా మంగళాచరణంచేసే, భగవత్ప్రార్థనంచేసే ప్రారంభిస్తాము. మీ నౌకరును చెట్టెక్కి కాయలు కోయమని

చెప్పితే ముందుగా వాడు చెట్టును తాకి నమస్కారంచేసి తర్వాత చెట్టెక్కుతాడు. బస్సుడ్రైవరు తీరా బండి నడిపేముందు చక్రాన్ని తాకి నమస్కరించి బండిని సాగిస్తాడు. తీరా భోజనానికి తయారైనపుడు భగవంతుని తలంచి నివేదనంచేసి మనం భోజనం చేస్తూన్నాము. దేవునికి నైవేద్యం పెట్టక తినేవాడు పంది అని వాడు తినేది కుళ్లిన కుక్క మాంసమని ఒక సంత్ పురుషుడు (సర్వజ్ఞకవి) తూలనాడాడు.

శ్రీ నిశ్చలదాసుగారు గ్రంథారంభంలో వస్తునిర్దేశరూప మంగళాచరణాన్ని ఆచరిస్తూన్నారు.

జోసుఖ నిత్యప్రకాశ విభు
నామరూప అధార్ ।

మతి నలఖేఁ జిహి మతిలఖేఁ
సోమైఁ శుద్ధ అపార్ ॥ 1

"యత్ ప్రకాశం సుఖం నిత్యం
నామరూపాశ్రయో విభు।
మతేర్లక్ష్య మలక్ష్యంచా
మేయం శుద్ధం తదస్మ్యహమ్ ॥"

అబ్ధి అపార స్వరూప మమ
లహరీ విష్ణుగణేశ్ ।
విధి రవి చందా వరుణయమ
సక్తి ధనేశ గణేశ్ ॥ 2

"అబ్ధేరివ మమానంత్యం
వివర్తాః వీచివత్ సురాః।
పంచ హేరంబ వైకుంఠ
శక్తి శంకర భాస్కరాః ॥"

జా కృపాలు సర్వజ్ఞకో
హియధారత మునిధ్యాన్ ।
తాకో హోత ఉపాధితైఁ
మోమైఁ మిథ్యాభాన్ ॥ 3

“ఈశః కృపాలుః సర్వజ్ఞో
యోగిభిర్య ఉపాస్యతే ।
స భాతి మయి చిన్మాత్రే
మృషాహేతు రుపాధినా ॥”

హ్వై జిహి జానై బిన జగత
మనహు జేవరీ సాఁప్ ।
నసై భుజగ జగ జిహిఁలహై
సోమైఁ ఆ పే ఆప్ ॥ 4

“అవిజ్ఞాతే జగత్ సత్యం
విజ్ఞాతే చ న కించన ।

లోలమాల్యే ఫణాటోపో
న నష్టో నతిరోహితః ॥"

బోధ చాహి జాకో సుకృతి
భజత రామ నిష్కామ్।
సోమేరో హై ఆత్ మా
కాకూఁ కరూఁ ప్రణామ్ ॥ 5

"రామం విజిజ్ఞాస్య నిరస్య కామం
భక్త్యై యదాస్త్యై కృతినో యతంతే।
సోఽహం భవచ్ఛేదకరః సమర్త్యై
న మేయమీడ్యం కిమివాత్మనోఽన్యమ్॥"

[శ్రీ నిశ్చలదాసుగారు మంగళాచరణం కోసం యీ అయిదు దోహాలను వినియోగించారు. ఆ హిందీ దోహాలకు అనువాదరూపమైన సంస్కృత శ్లోకాలు వెంటవెంటనే యివ్వబడినవి.]

"మంగళాచరణం చేస్తే మనకువచ్చే మేలుయేమి?" ఇది ఒక ప్రశ్న, "ప్రయోజన మనుద్దిశ్య న మందోఽపి ప్రవర్తతే" ప్రయోజనం లేకపోతే మూర్ఖుడుకూడా పనిలో ప్రవర్తింపడు. గింజలుకొలిచేవాడు లాభం అంటూ ప్రారంభిస్తాడు. పనిచేయమంటే "ఏమిలాభం" అని అడగటం మానవుని స్వభావం.

మంగళాచరణానికి మూడు ప్రయోజనా లున్నాయని శాస్త్రజ్ఞులు చెప్పుతారు. ఒకటి, సంప్రదాయ రక్షణ, రెండు. తానారంభించిన కార్యము నిర్విఘ్నముగ జరుగుట. మూడు, చిత్త ఏకాగ్రతద్వారా చిత్త శుద్ధి. ఈ మూడు ప్రయోజనాలు మంగళాచరణంద్వారా సిద్ధిస్తాయి.

వానచినుకు నదితో సంబంధం పెట్టు కొని స్వస్థానమైన సముద్రాన్ని మళ్లీ చేర్తుంది. ఎవ్వడైనా కానీ యెక్కడనుండి వచ్చాడో అక్కడికి వెళ్లవలసే వుంటుంది. జీవుడు తన స్వరూపమూ స్వస్థానమూ నైన భగవంతుని వదలి యీ సంసారంలో పరిభ్రమిస్తున్నాడు. "జీవోదేవస్సనాతనః" - జీవుడు సనాతనమైన దేవుడేనని శాస్త్రాలు పలికినవి. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" - జీవలోకంలోని యీ జీవుడు సనాతనమైన నా అంశమేనంటూ భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు. భగవంతుని నుండి వచ్చిన జీవుడు మళ్లీ భగవంతుని చేరుకొనేందుకు చేసే ప్రయాణమే యీ జీవితయాత్ర.

దూరప్రాంతమునుండి ఒక భక్తుడు వచ్చి శ్రీ రమణమహర్షులవారిని దర్శించి, "స్వామీ! నాకేదైనా ఒకమార్గం చెప్పండి" అని వేడుకొన్నాడు. "వచ్చినమార్గం పట్టి పోవయ్యా" అని మహర్షులవారు సమాధానం చెప్పారు. వాడు గ్రహించాడో గ్రహించలేదో కాని నిజమేమో అంతే। మన గమ్యమూ మన లక్ష్యమూ భగవంతుడే అని గుర్తెరిగి ఆ మహాప్రస్థానాన్ని అవలంబించుటే మానవుని కర్తవ్యము. శ్రీ మహర్షులవారు వచ్చినమార్గం పట్టిపొమ్మని చెప్పిన మాటలోని అర్థముఅదే.

వానచినుకు స్వస్థానమైన సముద్రాన్ని చేరాలంటే ఒకనదిని ఆశ్రయించాలె. నదిని ఆశ్రయించక ఆ చినుకు విడిగా పొడిగా వుండిపోతే ఆరిపోతుంది. తీరిపోతుంది.

అట్లే వ్యక్తి విడిగా వుండిపోతే సిద్ధిని బొందలేడు. ఒక సత్సంప్రదాయాన్ని ఒకసద్గురు సంప్రదాయాన్ని వాడు ఆశ్రయించవలసి వుంటుంది. "సంఘం శరణం గచ్ఛామి" అనే వాక్యం బౌద్ధధర్మ శరణత్రయాలలో ఒకటి. ఈ విధంగా సంఘానికి బద్ధుడైన వాడు సంప్రదాయ బద్ధుడైనవాడు ఆ సంప్రదాయ నియమాలను ఆచరింపవలయుట తప్పనిసరి. కార్యప్రారంభంలో మంగళాచరణం చేయుట సంప్రదాయ నియమం కాబట్టి అలా ఆచరించుట సంప్రదాయసంరక్షణ చేసినట్లవుతుంది. ఇది మొదటి ప్రయోజనము.

"నిర్విఘ్నకామో మంగళ మాచరేత్" కార్యం నిర్విఘ్నంగా కావాలని కోరేవాడు మంగళాచరణం చేయాలని ఆర్యపురుషుల

హితోపదేశము. ఈ ప్రపంచంలోని పంచ భూతాలను వాడుకోక మనకు ఒక్క పనీ జరుగదు. అడుగు తీసి అడుగు పెట్టాలంటే యీ బాహ్యప్రకృతి సహాయం మనకు వుండేతీరాలె. మరి యీ ప్రకృతి యీ ప్రపంచం యెవరి సొత్తు? నీదీ కాదు — నాదీ కాదు. ప్రభువు ఒకడున్నాడు. ఆయన అనుగ్రహం కల్గితే మనకు అన్నీ అనుకూలాలే. "సానుకూలే జగన్నాథే సానుకూలం జగత్త్రయం" జగన్నాథుడు అనుకూలమైతే జగత్త్రయము అనుకూలమే నంటూ శాస్త్రాలు వాకొన్నాయి. పరమాత్మునికి విముఖుడై ప్రకృతిని సాధింప గోరిన రావణాసురుని పది తలలూ యెగిరి పోయాయి. భగవంతుని మరచిపోయిన యీ మానవుడు ప్రకృతి ప్రకోపానికి

గురియై పోతూన్నాడు. మొన్న మొన్న రామేశ్వరంలో జరిగిన ఉపద్రవానికి కారణమేమంటారు!

తాను తలపెట్టిన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిపోవాలంటే భగవదనుగ్రహం కావాలె. ఆ భగవదనుగ్రహాన్ని సాధించేకోసం మంగళాచరణం చేయాలె. ఇది రెండవ ప్రయోజనము.

చిత్త ఏకాగ్రతను సాధించుట మంగళాచరణంయొక్క మూడవ ప్రయోజనము. కార్యకర్తలకు కర్మయోగులకు శ్రవణము చేయు శ్రోతలకు చిత్త ఏకాగ్రత ప్రధానమైన విషయము. ఏకాగ్రచిత్తం లేనివాడు యే ఘనకార్యాన్నీ సాధించలేడు. స్వామి వివేకానందులవారంతటి ఘనకార్యాన్ని సాధించారంటే — అర్జునుడు యుద్ధ

రంగంలో తత్త్వబోధను అనుభవానికి తెచ్చుకోగలిగాడంటే ఏకాగ్రచిత్తం యొక్క ప్రభావమే సుమా! సామాన్యంగా మన చిత్తానికి రెండే అవస్థలున్నాయి. ఒకటి శూన్యాగ్రత, రెండవది అనేకాగ్రత. శూన్యాగ్రమంటే లయావస్థ, అనేకాగ్రమంటే విక్షేపావస్థ. ఉదాహరణానికి ఒక్క మాట చెబుతాను. మీరు శ్రవణం చేస్తూన్నారు. శ్రవణం చేస్తూ చేస్తూ కొందరు మెల్లగా నిద్రపోతారు. దీనినే శూన్యాగ్రమంటారు. నిద్ర వస్తూంది కదా అని వెళ్ళి పడక వేసి పడుకొంటే నిద్ర రాదు కదా — లేనిపోని ఆలోచనలు బయల్దేర్తాయి. దానినే అనేకాగ్రమంటారు. ఈ రెండూ అతిమార్గాలు; అనర్థమార్గాలు. "సంన్యస్య శ్రవణం కుర్యాత్" అని శ్రుతి చెప్పింది.

శ్రవణం చేసేవాడు యీ రెండు మార్గాలను దూరం చేసుకొని శ్రవణం చేయాలె. ఈ రెంటి మధ్య ఒక మితమార్గం వుంది. అదే యేకాగ్ర స్థితి. శ్రీరామచంద్రుడు చిత్త వృత్తులనే కోతులను ఒక్క త్రాటిపై నడప గలిగినాడు. మనస్సుకు ప్రేరకుడైనవాడు సగుణబ్రహ్మమని చెప్పబడే మాయోపాధిక యీశ్వరుడు. ఆయన అనుగ్రహాన్ని సాధించేకోసం మంగళాచరణం చేయాలె ఇది మూడవ ప్రయోజనము.

మంగళాచరణంవల్ల కలిగే ప్రయోజనాలను చెప్పుకొన్న తర్వాత ఆ మంగళాచరణం యెన్ని విధాలుగా వుందో — ఆ విషయంకూడా చెప్పుకొందాము. వస్తు నిర్దేశరూప మంగళాచరణమని నమస్కారరూప మంగళాచరణమని ఆశీర్వాద

రూప మంగళాచరణమని మూడు విధాలుగ చెప్పబడ్తుంది.

వస్తునిర్దేశ రూప మంగళాచరణమనగా యేమి? "వసతీతివస్తు" ఏది త్రికాలములందు వసించివుంటుందో దానిని వస్తువంటారు. మూడు కాలములందు సత్యమై నిత్యమై చెక్కుచెదరక నిర్వికారమై వుండు పదార్థమొక్క పరబ్రహ్మమే. వేదాంత శాస్త్రాలలో దానినే వస్తువంటారు. ఆ బ్రహ్మ వస్తువు నిర్గుణమని సగుణమని రెండు విధాలు.

మాయోపాధిలో సంబంధంలేని శుద్ధ వస్తువును నిర్గుణబ్రహ్మమంటారు. మాయోపాధితోకూడిన బ్రహ్మ వస్తువును సగుణమంటారు. ఆనిర్గుణ నిర్విశేష పరబ్రహ్మమే తన స్వరూపమని అనుసంధానము చేయుట

వస్తునిర్దేశరూప మంగళాచరణము. ఇది అద్వైత వేదాంతులొనర్చు మంగళాచరణము. ఉత్తమాధికారులైనవారే దీనిని అందుకోగల్గుతారు. మంద మధ్యమాధికారులకిది చెప్పరాదు. నాగస్వరాన్ని ఆలకించి పడగలెత్తి ఆడేభాగ్యం నాగుబాములకే చెల్లు కాని మామూలు పాములకు వల్లకాదు సుమా!

"ప్రజ్ఞానం బ్రహ్మ-అహం బ్రహ్మాస్మి-సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" - ఈలాంటి మహావాక్య స్మరణ వస్తునిర్దేశరూప మంగళాచరణానికి చెందింది.

ఇక రెండవది నమస్కారరూప మంగళాచరణము. సద్గురువునకు యిష్టదైవమునకు నమస్కారాలు చెల్లించి కార్యారంభము చేయు పద్ధతిని నమస్కారరూప

మంగళాచరణమంటారు. లోకంలో చాలా మట్టుకు యీ పద్ధతే వ్యాపకంగావుంది. శ్రీ విద్యారణ్యస్వాములవారు తమ పంచదశి గ్రంథాన్ని ప్రారంభంచేస్తూ,

"నమః శ్రీ శంకరానంద
గురుపాదాంబు జన్మనే।
సవిలాస మహామోహ
గ్రాహ గ్రాసైక కర్మణే॥"

అని సద్గురుపునకు నమస్కరించి గ్రంథాన్ని ఉపక్రమించారు. సముద్రంలో స్నానం చేస్తే అన్ని నదులలో స్నానం చేసినట్లు. గురువునకు నమస్కరిస్తే అందరు దేవతలకు నమస్కరించినట్లే.

ఒక కథ వుంది. విఘ్నేశ్వరుడు కుమారస్వామి యిద్దరూ "నాకు పెండ్లి నాకు పెండ్లి" అంటూ తల్లిదండ్రులైన

పార్వతీ పరమేశ్వరులను పీడింప దొడి గారు. "భూప్రదక్షిణంచేసి ఎవరు ముందు వస్తే వారికి పెండ్లి" అని పెద్దలు పందెం పెట్టారు. కుమారస్వామి నెమలివాహన మెక్కి త్వరున బయలుదేరాడు. ఈ వినా యకుడు ఆయన వాహనంతో భూప్రదక్షి ణం యేమి చేస్తాడు! శక్తికి కానిపని యుక్తి తో జరుగుతుంది. పొట్టివానికి పుట్టెడు బుద్ధులుకదా! తల్లిదండ్రుల చుట్టూ మూడు పర్యాయాలు తిరిగి సాగిలపడి నమస్క రించి నేను గెలిచాను. నాకు పెండ్లి అంటూ గోలచేయ మొదలుపెట్టాడు. తల్లిదండ్రులకు ఒక్క పర్యాయం ప్రదక్షిణంచేస్తే భూప్రద క్షిణం యెన్నో పర్యాయాలు చేసినట్లవు తుందని శాస్త్రం చెప్పింది. నమస్కారంలో వుండే ప్రభావమిట్టిది.

మూడవది - ఆశీర్వాదరూప మంగళా చరణము. తనకూ తన అనుయాయులకూ యిష్టవస్తులాభాన్ని అపేక్షించి ప్రార్థన చేయుట ఆశీర్వాదరూప మంగళాచరణ మనబడ్తుంది. "సర్వేషాం స్వస్తిభవతు - సబ్ కోసమ్మతి దేభగవాన్. మహాత్మా గాంధికీజై" ఇట్టి ప్రార్థనలు ఆతెగకు సంబంధిస్తాయి. ఈ విధంగా మంగళాచరణము మూడు విధముల చెప్పబడ్తుంది.

విచారసాగర గ్రంథకర్తయగు సాధు నిశ్చలదాసుగారు తన గ్రంథారంభంలో వస్తునిర్దేశ రూప మంగళాచరణాన్ని నిరూపిస్తూన్నాడు.

"జోసుఖ నిత్యప్రకాశ విభు
నామరూప ఆధార్ ।

మతి నలఖై, జిహి మతిలఖై,
సోమై శుద్ధ అపార్ ॥ ''

సాధునిశ్చలదాసుగారు ఈ దోహా (హిందీ పద్యము) ద్వారా నిర్గుణ పరబ్రహ్మ వస్తునిర్దేశరూప మంగళాచరణం చేశారు. ఈ దోహాలో యెనిమిది పదములతో పరమాత్మ లక్షణాలు యేడింటని చెప్పియున్నారు.

పరమాత్మ దృశ్యవస్తువుకాదు. దృశ్య వస్తువైతే "యిదో యిది గడియారం" అని చెప్పినట్లు వ్రేలుపెట్టి చూపించుటకు వీలుండేది. అటుకాదు కాబట్టి లక్షణాలద్వారానే పరమాత్మ స్వరూపాన్ని మనకు యెరుకపరచవలసివుంటుంది.

"జో" అనగా యేది యేడు లక్షణాలతో ముందుముందు క్రమముగ చెప్పబడ్తూందో,

"సో" ఆ పరబ్రహ్మము. "మైఁ" = నేను", పరబ్రహ్మమును ఆత్మకు అభిన్నముగ స్మరించి మంగళాచరణం చేయబడింది.

ఒకటి సుఖ. రెండు నిత్య, మూడు ప్రకాశ, నాల్గు విభు, అయిదు నామరూప ఆధార్, ఆరు మతినలఖై జిహి మతిలఖై, యేడు శుద్ధ యెనిమిది అపార్ — అని ఈ విధంగా యెనిమిది పదాలున్నాయి. రెండు రెండు పదాలుకలసి ఒక్కొక్క లక్షణముగా యేడు లక్షణాలు చెప్పబడ్డాయి. సుఖనిత్య, నిత్యప్రకాశ, ప్రకాశవిభు, విభునామ రూప ఆధార్, నామరూపఆధార్, మతి నలఖై జిహి మతిలఖై. మతినలఖై జిహి మతిలఖై శుద్ధ. శుద్ధ అపార – ఈ విధంగా ప్రత్యగభిన్న పరబ్రహ్మమునకు యేడు లక్షణాలు చెప్పబడినవి.

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని శ్రుతి చెప్పిన అవాఙ్మానస గోచరమైన పరబ్రహ్మాన్ని తెలియజేయాలంటే లక్షణాలతో తప్ప గత్యంతరంలేదు. అతివ్యాప్తి అవ్యాప్తి అసంభవము అనే దోషాలు లేకుండా పరబ్రహ్మ స్వరూపాన్ని తెలియజేయాలంటే ఒకటి రెండు లక్షణాలు చెప్పితే సరిపోదు. అందువలన యేడు లక్షణాలు చెప్పవలసివచ్చింది.

దృష్టాంత మొకటి వినండి! "పాలు అంటే యెట్టివి? వాటి లక్షణం చెప్పు" మని ఒకడు అడిగాడు. తెల్లగవుండేవి పా"లంటూ ఒకడు సమాధానం చెప్పాడు. సున్నపు నీళ్ళుకూడా తెల్లగ వుంటవి. "తెల్లగ వుండుట" అనే లక్షణం పాలయందే గాక సున్నపు నీటియందుకూడా ప్రవర్తిం

బింది. ఇది దోషం. దీనినే అతివ్యాప్తి దోష మంటారు. ఒక వస్తువునకుగా చెప్పిన లక్షణము ఆ వస్తువునందే కాక యితర వస్తువులయందుకూడా ప్రవర్తిస్తే దానిని అతివ్యాప్తి దోషం కల్గిన లక్షణమని అంటారు. "గోవు యెట్టిది" అని అడిగితే "కొమ్ములు కలిగినది గోవు" అని ఒకాయన చెప్పారు. కాని "కొమ్ములు కల్గి వుండుట" అనే లక్షణం గోవునందే కాక బర్రెగొడ్డునందుకూడా ప్రవర్తిస్తుంది. ఈ లక్షణంతో గోవును నిష్కర్షగా తెలుసుకొనే వీలు లేకపోయింది. ఈ లక్షణానికి అతివ్యాప్తి దోషం పట్టిందన్నమాట.

"పాలు తెల్లనివి" అని లక్షణం చెప్పితే తెల్లని వస్తువులు అనేకం వున్నాయి. 'ద్రవ రూపమైనవి పాలు' అని చెప్పితే నీళ్లు

కూడా ద్రవరూపమే. "పాలు తియ్యనివి" అని అంటే చక్కెర బెల్లము కలకండ (పటిక బెల్లము) తియ్యనివస్తువులే. పాలను తెలియజేస్తూ ఒక్కొక్క లక్షణం చెప్పితే అతివ్యాప్తిదోషానికి తావుంది.

"తియ్యగా ద్రవరూపంగా వుండేవి పాలు" అని చెప్పితే పానకము కూడ ఆ రెండు లక్షణాలు కల్గివుంటుంది. "తెల్లగా ద్రవరూపంగా వుండేవిపాలు" అని చెప్పితే సున్నపునీళ్లు ఆ రెండు లక్షణాలు కల్గి వుంటవి. "తియ్యగ తెల్లగ వుండువస్తువు పాలు" అని అంటే ఆ రెండు లక్షణాలు పంచదారయందు పటిక బెల్లము (కలకండ) నందూ వున్నాయి.

"పాలు యెట్టివి" అని అడిగినప్పుడు "తియ్యగ తెల్లగ ద్రవరూపంగా వుండేవి" అని మూడు లక్షణాలతో కలిపి చెప్పితే యెట్టి అతివ్యాప్తి దోషానికి తావులేకుండా పాలను తెలుసుకొనేందుకు వీలు కలుగుతుంది. మూడు లక్షణాలూ చెప్పక యే ఒకటో రెండో లక్షణాలు చెప్పితే అతివ్యాప్తి దోషానికి దారితీసి పాలయొక్క స్వరూపాన్ని తెలుసుకొనేందుకు వీలులేకుండా చేస్తుంది. ఇది దృష్టాంతం.

ఈ విధంగానే పరమాత్మ స్వరూపాన్ని తెలియజేసేందుకు పూనుకొన్న నిశ్చలదాసుగారు యేడు లక్షణాలను చెప్పియున్నారు. యే ఒకటి రెండు లక్షణాలను చెప్పితే అతివ్యాప్తి అవ్యాప్తి అసంభవమనే దోషాలకు గురికావచ్చునని ఆ లోపం

లేకుండుటకు వరుసగా యేడు లక్షణాలను చెప్పుట జరిగింది.

అతివ్యాప్తి దోషాన్ని గురించి లోగా ఒక దృష్టాంతం చెప్పినాము. "కొమ్ములు వుండేది గోవు" అని చెప్పిన పక్షంలో బర్రెకు కూడా కొమ్ములుంటాయి కాబట్టి ఆ లక్షణానికి అతివ్యాప్తి దోషం పట్టింది. "తెల్లగ వుండేది గోవు" అని చెప్పితే ఆ లక్షణము గోవులలో కొన్నిటికి మాత్రమే అన్వయిస్తుంది. గోవు తెల్లగను వుండొచ్చు, నల్లగను వుండొచ్చు కావున ఆ లక్షణము ఏకదేశీయంలో మాత్రం సంబంధిస్తుంది. ఈ దోషాన్ని అవ్యాప్తి దోషమంటారు.

"ఒక్క గిట్టవుండేది గోవు" అని చెప్పితే ఆ లక్షణం గోవుకు బొత్తుగా సంబంధించదు. ఒక్క గిట్టవుండుట గుర్రానికే కాని

గోవుకుకాదు. ఆవు గిట్టచీలి రెండుగ వుం టుంది. ఈ లక్షణానికి అసంభవదోషం పట్టింది. చెప్పిన లక్షణము ఆ వస్తువునందు కాక మరేదో వస్తువునందు ప్రవర్తిస్తే దానిని అసంభవ దోషమంటారు.

ఇద్దరు ధార్మిక వ్యక్తులు ఒక అడవి గుండా ప్రయాణంచేస్తూ ఒక చెట్టుక్రింద కూర్చొని ప్రసంగవశాత్తు "గోవునకు నమస్కరిస్తే ముప్పది మూడుకోట్ల దేవత లకు నమస్కరించినట్లే "నని అనుకుంటూం డినారు. చాటున వుండిన ఒక ఆటవికుడు అదివిని తానూ ఆ పుణ్యం సంపాదించాలనే అభిప్రాయంతో వారి యెదుటికివచ్చి "ఆవు ఎట్లుంటుందో తెల్పం"డని కోరాడు. ఆవు యెదురుగలేదు కాబట్టి లక్షణం చెప్పి తెలియజేయాలె. "కొమ్ములుండేది గోవు"

అని చెప్పినారు. వాడు వెతుకుతూపోగా ఒక బర్రెయెదురైంది. దానికీ కొమ్ములున్నాయి. అదే గోవు అని వాడు సాగిలి పడి నమస్కరించాడు. ఇదొక్క అనర్థమై పోయింది.

"తెల్లనిదిగో"వని మరో లక్షణం చెప్పారు. వాడు వెదుకుతూపోగా నల్లని ఆవు యెదురైంది. అది ఆవుకాదేమోనని వాడు మిన్నక వెళ్ళిపోయాడు. ఇదీ ఒక అనర్థం.

"ఒంటిగిట్ట వుండేది గోవ"ని ఒక లక్షణం చెప్పారు. వెదుకుతూపోగా గుర్రమొకటి యెదురైంది. అదే గోవని నమస్కరించాడు. ఈ మూడు లక్షణాలూ దోష సహితాలే. మొదటిది అతివ్యాప్తిదోషం. రెండవది అవ్యాప్తిదోషం. మూడవది

అసంభవ దోషమని చెప్పబడ్తుంది. గోవు యొక్క స్వరూపాన్ని సమగ్రంగా తెలియ జేయవలెననిన "కొమ్ములు గంగడోలు పొదుగు కల్గిననది గోవ"ని యిన్ని లక్షణ ములు చెప్పవలసి వుంటుంది.

ఈలాంటి దోషములకు అవకాశ ముండ కూడదనే అభిప్రాయంతో సాధు నిశ్చల దాసుగారు పరబ్రహ్మ స్వరూపాన్ని ప్రతి పాదించుటకు యెనిమిది పదములతో యేడు లక్షణాలను చెప్పివున్నారు.

మొదటి దోహా

"జో సుఖ నిత్య ప్రకాశ విభు
నామరూప ఆధార్।
మతి నలఖై మతిలఖై
సోమై శుద్ధ అపార్॥"

జ్ఞానమువంటి పవిత్రవస్తువు మరొక్కటిలేదు. అజ్ఞానమువంటి అపవిత్ర వస్తువు వేరొక్కటిలేదు. ఈ అజ్ఞాన ప్రభావంతోనే జీవుడు తన స్వరూపాన్ని మరచి జనన మరణరూప సంసారములోపడి తపిస్తూన్నాడు. ఈ అనర్థానికి మూలము అజ్ఞానమే. సర్వానర్థమూలమగు అజ్ఞానము జ్ఞానముతోనే నశిస్తుంది. అజ్ఞానము నశించిందా జన్మ మృత్యుజరావ్యాధి దుఃఖరూప సంసారానికి ఆత్యంతిక నివృత్తి సంభవిస్తుంది.

నివృత్తి తాత్కాలికమని ఆత్యంతికమని రెండు విధాలు. కారణమట్లేవుండి కార్యం నశించడం తాత్కాలిక నివృత్తి. కారణసహితంగా కార్యం నశిస్తే దానిని ఆత్యంతిక నివృత్తి అంటారు.

పరమాత్మ జ్ఞానంతో అజ్ఞానం నశి
స్తుంది. పరమాత్మ దృశ్యవస్తువుకాదు
కాబట్టి లక్షణాలద్వారానే తెలుసుకోవలసి
వుంటుంది. యెనిమిది పదాలతో యేడు
లక్షణాలు ఈ దోహాలో చెప్పబడినవి.

"జో" అనే మొదటి పదంతో పరబ్ర
హ్మము సూచింపబడింది. ఆ పరబ్రహ్మ
మెట్టిదంటే - సుఖము నిత్యము. ఈ రెండు
పదములు కలసి ఒక లక్షణము. ఈ విధం
గానే, నిత్యము ప్రకాశము. ఇదొక్క లక్ష
ణము. వెనుక పదమొకటి, ముందు పద
మొకటి కలుపుకొని ఒక లక్షణంగా గుర్తిం
చాలె. ఒకేపదం చెప్పితే ఆ లక్షణానికి
అతివ్యాప్తి దోషం వస్తుంది కాబట్టి ఆ
దోషాన్ని నివారణం చేసేకోసం రెండో
పదం చెప్పవలసివచ్చింది.

1. పరబ్రహ్మము సుఖస్వరూపము. సుఖము బ్రహ్మలక్షణము, ఈ ఒక్క లక్షణం చెప్పితే అతివ్యాప్తిదోషం వస్తుంది. విషయ పదార్థాలలోకూడ సుఖము ప్రతీతమైతూంది. సుఖము బ్రహ్మస్వరూపమని అంటే విషయసుఖంకూడ బ్రహ్మస్వరూపమని భావించి, భ్రమలోపడే అవకాశం వుంది. ఆ భ్రాంతికి అవకాశం లేకుండా వుండేకోసం అనగా అతివ్యాప్తిదోషం కల్గకుండా వుండేకోసం "నిత్యం" అనే లక్షణం వెంటనే చెప్పడం జరిగింది. విషయసుఖము నిత్యముకాదు. బ్రహ్మసుఖము నిత్యమైనది.

అనిత్యమైన విషయసుఖము సుఖమే కాదు; దుఃఖస్వరూపమేనంటూ భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. * "అనిత్య

---

* అ. 9, శ్లో॥ 33

మసుఖం లోకం" — ఈలోకము అనిత్య మైంది. అసుఖమైంది. అని మరియు •"ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తి నోఽర్జున" — బ్రహ్మలోక పర్యంతమైన సమస్తలోకాలు పునర్జన్మాన్ని కల్గించేవే సుమా! అని చెప్పి వున్నాడు. విషయ సుఖాలు సుఖాభాసలేకాని సుఖాలుకాదని పై మాటలో అర్థము. ఒకవేళ విషయ సుఖాలు సుఖాలే అని ఒప్పుకొన్నా నిత్య ములు మాత్రం కావని అందరూ అంగీక రించవలసిందే.

విషయాలలో కనబడే సుఖం సుఖా భాసేకాని సుఖంకాదనే సంగతిని గురించి ఒక ఉదాహరణం వినండి. ఒక మను ష్యుడు నీళ్లు త్రాగేకోసం కోనేటిలోనికి

• అ. 8, శ్లో॥ 16

దిగాడు. ఆ లోపల నీటి అడుగున తళ తళ మంటూ ఒక ముత్యాలహారం కానొచ్చింది. ఎవరో బావిలో పడవేసుకొనిపోయారని దానికోసం వాడు నీళ్లల్లో మునిగి తారాడాడు. కాని చేతికి దొరకలేదు. పైకివచ్చి తొంగి చూస్తే కానొస్తుంది. లోపలకి మునిగి పట్టుకోబోతే చేతికి దొరకలేదు. అంతలో ఒక బుద్ధిమంతుడు ఆ దారిన పోతూ వాని సంగతి విచారించాడు. "ముత్యాలహారం అదుగో! కానొస్తుంది; చేతికి దొరుకదే!" అని వాడంటాడు. ఆ పెద్దమనిషి క్రింద తట్టు చూడక పైవైపు చూచాడు. గట్టున వుండే చెట్టుకొమ్మ కొక ముత్యాలహారం వ్రేలాడ్తూవుంది. నీళ్లల్లోకనబడేది దాని ప్రతిబింబం మాత్రం. వస్తువుండేదొకచోట, మనము వెతికేదొక

చోట. సుఖముండేచోటు ఆత్మయందు, యెన్ని జన్మలనుండి వెతికినా వున్నట్టు కానొస్తుంది - చేతికి దొరకదు.

విషయసుఖాలు అనిత్యమైనవి కాబట్టి బ్రహ్మసుఖము దానికంటె వేరని నిరూపించేకోసం నిత్యమనే లక్షణం చెప్పబడింది. ఒక విధమైన అతివ్యాప్తిదోషం ఈ విధంగా నివారింపబడింది. ఈ చోట మరొక్క అతివ్యాప్తిదోషాన్నికూడ నివారించవలసివుంది.

ఆత్మసుఖస్వరూపము అని చెప్పబడింది. కదా! నైయాయికులు ఆమాటకు ఒప్పుకొన్నప్పటికిని ఆసుఖము ఆత్మకు గుణమని చెప్పుతారు. ఆ మాట వేదాంతులమైన మనకు యిష్టంకాదు. గుణమునకు గుణి వేరుగా వుండాలె. అదీకాక ఆత్మకు సంబం

ధించిన ఆ సుఖము నిత్యమని వారు ఒప్పు
కోరు. అనిత్యమని అంటారు. మనవాళ్ళు
సుఖము ఆత్మకు స్వరూపమని చెప్పుతారు.
నైయాయికులు చెప్పే సుఖాన్ని వేరుపరిచే
కోసం నిత్యము అంటూ రెండవ లక్షణం
చెప్పి అతివ్యాప్తిదోషాన్ని నివారించినారు.
సుఖము నిత్యము అను రెండు లక్షణాల
కూడిక ఆత్మయందు, పరమాత్మయందు
తప్ప మరెక్కడా గోచరించవు. ఇక్కడికి
ఒక్క లక్షణం చెప్పడం జరిగింది.

2. పరబ్రహ్మము నిత్యము మరియూ
ప్రకాశ స్వరూపముకూడ. "నిత్యము"అనే
ఒక్క లక్షణం మాత్రం చెప్పితే, రెండు
చోట్ల అతివ్యాప్తి దోషం సంభవిస్తుంది.
సాంఖ్యులు ప్రకృతిని నిత్యమని చెప్పు
తారు. ఆకాశము కాలము దిక్కులు నిత్య

ములని నైయాయికుల మతము, ఈ రెండు చోట్ల కలిగే అతివ్యాప్తిదోషాన్ని నివారిస్తూ ప్రకాశమనే మరో లక్షణం ప్రక్కన చేర్చబడింది.

ప్రకృతికానీ ఆకాశంకానీ జడరూపమైనవి. స్వయంగా ప్రవర్తించే ప్రకాశశక్తి వాటికిలేదు. ఉదాహరణకు ఒకమాట. నీవొక కారును కొన్నావు. అది స్వీడన్‌నుండి యిప్పుడే వచ్చింది. ముప్పై వేల రూపాయల కారు. ఏమైనా డ్రైవరు లేనిదే అది ముందుకు పోలేదు. అది డ్రైవరుకు అధీనమైవుంటుంది. అట్లే ప్రకృతి అనే కారుకు డ్రైవరు పరమాత్మ వుండనే వుండాలె. ఆ మతంవారు ప్రకృతిని ఆకాశాదులను నిత్యములని చెప్పారుకాని వేదాంతుల అభిప్రాయంలో అవి నిత్యంకాదు.

నిత్యములైతే మూడవస్థలలోనూవుండాలె. సుషుప్త్యవస్థలో వాటి జాడ లేదు. ఒక్క జాగ్రదవస్థను మాత్రం ముఖ్యంగా దృష్టిలో పెట్టుకొన్నవారి అభిప్రాయంలో అవి నిత్యం కావచ్చు. కాని మూడు అవస్థలకూ సమాన ప్రాతినిధ్యమిచ్చిన వేదాంతుల దృష్టిలో అవి అనిత్యాలు. ఒకవేళ వారి మతాన్ని అనుసరించి అవి నిత్యములని ఒప్పుకొన్నప్పటికి అవి ప్రకాశవంతాలు మాత్రంకాదు. అవి జడవస్తువులు. ఈ జడవస్తువుల నన్నింటిని ప్రకాశింపజేసే వస్తువు పరమాత్మ. పరమాత్మ స్వయంగా చైతన్యస్వరూపమై జడములైన ప్రకృతి పదార్థాలకు చైతన్యాన్ని ప్రసాదిస్తూనాన్నాడు. ఈ జడపదార్థాలలో అగుపడే ప్రకాశం కనబడే చైతన్యం స్వయంగా వీటిది

కాదు; పరమాత్మదే అని గుర్తించాలె. పరమాత్మయొక్క ప్రకాశం పరతంత్రమైంది కాదు; స్వతంత్రమైంది. ప్రకాశమనే మాటకు జ్ఞానప్రకాశమని చైతన్యమని అర్థాన్ని గ్రహించాలె. సూర్యుడు తన ప్రకాశంలో తాను ప్రకాశిస్తూ ఆయాయితర వస్తువులను ప్రకాశింప జేస్తూన్నట్లు పరమాత్మ తన చైతన్య ప్రకాశంలో తాను ప్రకాశిస్తూ తనలో కల్పింపబడిన ప్రకృతి ఆకాశ కాల దిక్సమూహాన్ని ప్రకాశింపజేస్తూ వున్నాడు.

3. పరబ్రహ్మము ప్రకాశస్వరూపము మరియు విభుస్వరూపము. ప్రకాశ విభుస్వరూపమనునది మూడవ లక్షణము. కేవలము ప్రకాశస్వరూపుడు అని మాత్రం చెప్పితే అతివ్యాప్తిదోషం వస్తుంది. ఎట్లంటే

ప్రకాశం కల్గిన వస్తువులు బ్రహ్మాండంలో అయిదు పిండాండంలో నాలుగున్నవి. వస్తువులను ప్రకాశింపజేసే శక్తి వీటికి వుంది. సూర్యుడు చంద్రుడు అగ్ని నక్షత్రాలు విద్యుత్తు (కరెంట్) ఈ అయిదూ బ్రహ్మాండంలో ప్రకాశకర వస్తువులు, కన్ను వాక్కు మనస్సు బుద్ధి ఈ నాలుగు పిండాండంలో ప్రకాశకరవస్తువులు. పరబ్రహ్మము ప్రకాశస్వరూపము అని అంటే ఈ తొమ్మిదికూడ ప్రకాశస్వరూపాలే కాబట్టి వీటినికూడ పరబ్రహ్మమని చెప్పినట్లయి తుంది. ఈ దోషాన్ని నివారించేకోసం "ప్రకాశ"మనే లక్షణంతోపాటు "విభు" అనే లక్షణమూ చేర్చబడింది.

పైన చెప్పిన ప్రకాశవస్తువులలో

సూర్యుడు చంద్రుడు అగ్ని చుక్కలు కరెంటు ఈ అయిదూ బ్రహ్మాండజ్యోతులను మాట అందరికీ తెలిసినదే. ఇక పిండాండ జ్యోతులని చెప్పినవి నాల్గు. కన్ను వస్తువును ప్రకాశింపజేస్తుంది. "అది చెట్టు" అని తెలుసుకొన్నామంటే కంటి వలననే కాబట్టి అది జ్యోతి అయింది. వాక్కుకూడా ఒక దీపమే. "మంచినీళ్లు తీసుకరా" అని అన్నాను. ఆ మాటతో నీకావస్తువు తెలియబడింది. కాబట్టి వాక్కు జ్యోతిర్లింగమని బసవేశ్వరుడు అన్నాడు. అట్లే మనస్సు ద్వారా బుద్ధి ద్వారాకూడా విషయప్రకాశనం వస్తుప్రకాశనం జరుగుతూంది. కాబట్టి అవికూడా జ్యోతులే. అందువలన పైఅయిదింటిలో ఈ నాల్గింటినికూడా చేర్చారు.

ఈ తొమ్మిదింటిని ప్రకాశ స్వరూపాలని చెప్పుటకూడా ఉపచారానికి మాత్రం. నిజంగా వీటిలోని ప్రకాశం వీటిది కాదు. కావుననే భగవంతుడు భగవద్గీతలో —

"యదాదిత్యగతం తేజో
జగద్భాసయతేఽఖిలమ్।
యచ్చంద్ర మసి యచ్చాగ్నౌ
త త్తేజో విద్ధిమామకమ్॥"

— అని పదైదవ అధ్యాయంలోను "జ్యోతి షామని తజ్జ్యోతిః" అంటూ పదమూడవ అధ్యాయంలోను జ్యోతులకు మూలజ్యోతి తానేననీ అన్ని జ్యోతులలోని తేజస్సు తనదేననీ సెలవిచ్చివున్నాడు.

ఒకవేళ కొందరు చెప్పినట్లు ఈ సూర్య చంద్రాదిక వస్తువులను ప్రకాశ స్వరూపాలే అని ఒప్పుకొన్నప్పటికినీ అవి విభు

స్వరూపాలు మాత్రం కావు. విభువు అంటే వ్యాపకమైనది అని అర్థము. సర్వపరిపూర్ణంగా వుండే వస్తువు విభువని చెప్పబడ్తుంది. సూర్యుడు విభువు కాలేదు. అతడుకాని అతని ప్రకాశంకాని ఒక చోట వుంటే ఒకచోట వుండదు. అట్లే చంద్ర నక్షత్రాదికాలు ఏకదేశీయ పదార్థాలు; పరిచ్ఛిన్నాలు. ఇవి విభువులు కాలేవు. వీటిలో ప్రకాశమనే లక్షణం ఘటించవచ్చు కాని విభువనే లక్షణం ఘటించదు. ప్రకాశమూ విభువూ అనే రెండు లక్షణాలూ పరబ్రహ్మ పరమాత్మయందే ఘటించగల్గుతాయి. ప్రకాశమనే ఒక్క లక్షణమే చెప్పితే అతివ్యాప్తిదోషం వస్తుందని విభువు అనే రెండవ లక్షణం చెప్పడం జరిగింది.

సుఖము నిత్యము ప్రకాశము విభుపు అనే నాల్గు పదాలతో పరబ్రహ్మము యొక్క మూడు లక్షణాలు చెప్పడం జరిగింది. ఇంతవరకు స్వరూపలక్షణాలు ఇక ముందు చెప్పబోయే "నామరూపాధారము" అనే లక్షణము తటస్థలక్షణమునకు చెందింది. స్వరూపలక్షణమంటే యేమో తటస్థలక్షణమంటే యేమో ఇక విచారించుకొందాము.

స్వరూపలక్షణమంటే యేమి? "స్వరూపం సత్ వ్యావర్తకం స్వరూపలక్షణం" — అనగా స్వరూపమునందే యెప్పుడూ వుండి ఇతరభిన్నవస్తువులను వేరుపరచి చూపించునది స్వరూపలక్షణమనబడ్తుంది. పరబ్రహ్మముయొక్క స్వరూపలక్షణాన్ని తైత్తిరీయోపనిషత్తు "సత్యం జ్ఞానమనంతం

బ్రహ్మ"అని నుడివినది.అనగా సత్యస్వరూపమైనది,జ్ఞానస్వరూపమైనది,అనంతస్వరూపమైనది బ్రహ్మమని ఆ వాక్యానికి అర్థము.

పరబ్రహ్మమునందు సత్యమనే లక్షణము "స్వరూపం సత్" స్వరూపంగానే వుండి అసత్తునుండి "వ్యావర్తకం" వేరుపరచి తెలియజేయుచున్నది. అట్లే జ్ఞానమను లక్షణము స్వరూపంలోనే వుండి "స్వరూపం సత్" పరబ్రహ్మన్ని అజ్ఞానంనుండి " వ్యావర్తకం" వేరుచేసి చూపిస్తూంది. "అనంతం" అను లక్షణము "స్వరూపం సన్," పరబ్రహ్మనికి స్వరూపంగానే వుండి అంతవంతాలైన వస్తువులనుండి "వ్యావర్తకం "వేరుపరుస్తూవుంది.

నిశ్చలదాసుగారు "సుఖ నిత్యప్రకాశవిభు" అని పరబ్రహ్మనికి చెప్పిన నాల్గు

లక్షణాలు స్వరూపలక్షణాలు. సుఖమనే లక్షణం స్వరూపంగావుండి దుఃఖంనుండి వేరుపరుస్తూవుంది. నిత్యమనే లక్షణం పరబ్రహ్మానికి స్వరూపంగావుండి అనిత్యపదార్థాలను వేరుపరుస్తూవుంది. ప్రకాశమనే లక్షణం స్వరూపంగావుండి జడవస్తువులనుండి ప్రత్యేకింపజేస్తూంది. విభువు అనే లక్షణము స్వరూపంగావుండి పరిచ్ఛిన్న పదార్థాలకంటే వేరే అని తెలియజేస్తూంది. ఈ విధంగా "సుఖ నిత్యప్రకాశ విభు" అని చెప్పిన నాల్గు లక్షణాలు పరబ్రహ్మానికి స్వరూప లక్షణాలు. ఇక చెప్పబోయే "నామరూపాధారము" అను లక్షణము తటస్థ లక్షణము.

తటస్థ లక్షణమంటే యేమి? "కాదాచిత్కేసతి వ్యావర్తకం తటస్థలక్షణం"

అనగా స్వరూపంలో ఒకానొక సమయాన వుండి తదితర వస్తువుల నుండి వేరుపరచు నది తటస్థ లక్షణం. ఉదాహరణము వినండి. నేను బజారులో రోడ్డుపైన నిలుబడి "కన్యకాపరమేశ్వరీ దేవస్థానం యెక్కడండీ" అంటూ ఒకాయనను అడిగాను. అదో గేటు దగ్గర కారు నిలబడి వుందే - అదేనని ఆయన సమాధానం చెప్పాడు. ఆ కారు యెప్పుడూ గేటు దగ్గర నిలబడివుండదు. "కదా చిత్కే" ఒకానొక సమయంలో వుండింది. అయినా తక్కిన భవనాలనుండి వేరుపరచే దేవస్థాన భవనాన్ని నాకు చూపగలిగింది. ఇది ఉదాహరణ.

ఈ మంగళాచరణంలో పరబ్రహ్మము "నామరూపాలకు ఆధారము" అని చెప్ప

బడింది. ఈ నామరూపాలు పరమాత్మ యందు ఎప్పుడూ వుండవు. ఒకానొక సమయంలో ఉపాధి సంబంధం వున్నప్పు డుంటాయి. అయినా యీ లక్షణం పరమాత్మను తదితర వస్తువులనుండి వేరు పరచి చూపిస్తుంది. నామరూపాల సంబంధంలేక పరమాత్మ వుండ గల్గుతాడు. పరబ్రహ్మము మాయతో సంబంధపడి నప్పుడు యీ "నామరూపాధారత్వ"మనే లక్షణము గోచరిస్తుంది.

4. పరబ్రహ్మము విభు స్వరూపము మరియు నామరూపాధార స్వరూపము. ఇది నాల్గవ లక్షణము. పరమాత్మ కేవలము విభువు అని ఒక్క లక్షణం చెప్పితే, విభువు అనే లక్షణం ఆకాశంలోకూడా ప్రవర్తిస్తుంది. కాబట్టి అతివ్యాప్తిదోషం

వస్తుంది. విభువు అనగా వ్యాపకమని అర్థము. ఆకాశము అంతటా వ్యాపకమై వున్నదికదా!

భూమిపై బండి నడిస్తే గడగడ అనే శబ్దం వస్తుంది. శబ్దం రావాలంటే ఆకాశం వుండాలె. అట్లే నీరు ప్రవహిస్తూంటే జులు జులు అనే శబ్దం వస్తుంది. అగ్ని మండే టప్పుడు భగ భగ అనే శబ్దం కల్గుతుంది. గాలి వీచేటప్పుడు బున్ అనే శబ్దం వుంటుంది. ఈ అన్నిచోట్లా ఆకాశం వుందని అర్థం. అందువల్లనే ఆకాశాన్ని వ్యాపకమని చెప్పినాము. పరమాత్మ విభువు అనే లక్షణాన్ని చెప్పితే ఆ లక్షణం ఆకాశంలో కూడా వ్యాపిస్తుంది. కాబట్టి ఆ దోషాన్ని నివారించేకోసం "నామరూపాధారము" అనే మరో పదం చేర్చి చెప్పడం జరిగింది.

ఆకాశంలో "విభు" లక్షణం వున్నప్పటికీ "నామరూపాధారము" అనే లక్షణం ఆకాశానికి సరిపోదు. ఎందుకంటే — ఆ ఆకాశం యీ నామరూపాలలోనికి చేరిందే. విభుత్వము - నామరూపాధారత్వము అనే రెండు లక్షణాలూ పరమాత్మునికి సంబంధపడేవే కాని ఆకాశానికి సంబంధ పడవు. ఈ విధంగా విభువు అనే లక్షణం పై వచ్చే అతివ్యాప్తిదోషాన్ని "నామరూపాధారము" అనే లక్షణము నివారించింది.

పై విధంగా చెప్పబడిన సుఖము నిత్యము ప్రకాశము విభువు నామరూపాధారమునైన యేవస్తువు కలదో అదియే నా స్వరూపమని అనుసంధానం చేయాలె. ఈ స్వరూపానుసంధానమే యీ మంగళాచరణ స్వరూపము.

ఆ పరమాత్మ "నామరూపాధార వస్తువు" అని చెప్పినప్పుడు ఒక విధమైన అతివ్యాప్తిదోషం వస్తుంది. మందాంధకారంలో త్రాటని చూచి పామని తలంచినాము. పూర్తివెలుతురులోనైనా పూర్తిచీకటిలోనైనా భ్రాంతి కలిగే వీలులేదు. మందాంధకారంలో అధ్యాస యేర్పడ్తుంది. ఆ కల్పిత సర్పముయొక్క నామరూపాలకు త్రాడు ఆధారము "నామరూపాధారము పరమాత్మ" అని చెప్పినప్పుడు ఆ నామరూపాధారమనే లక్షణము త్రాటియందుకూడా వర్తిస్తుంది. ఎందుకంటే కల్పితసర్పముయొక్క నామరూపాలకు ఆ త్రాడు ఆధారమై వుంది కాబట్టి ఈ అతివ్యాప్తిని నివారించేకోసం శ్రీ నిశ్చలదాసుగారు "మతి

నలఖై జిహి మతిలఖై" అనే లక్షణాన్ని చేర్చటం జరిగింది.

5. పరబ్రహ్మము నామరూప అధారము మరియు "మతినలఖై జిహి మతిలఖై" (అనగా "యేది బుద్ధికి దృశ్యం కాదో – దేనికి బుద్ధి దృశ్యమై వుందో అది" అని ఒక అర్థము. "ఏది బుద్ధికి తెలియబడదో - యేది బుద్ధికి తెలియబడునో అది" అని మరో అర్థము. వీటి వివరణం ముందు వస్తుంది.) అనే లక్షణం కలిగివుంది.

"మతినలఖై జిహి మతిలఖై" - అని అనగా "స్వయంప్రకాశము అని అర్థము. మతి = బుద్ధిచేత, నలఖై = యేది తెలియబడదో, జిహి= దేనిచేత, మతిలఖై = బుద్ధి తెలియబడ్తుందో - అది పరమాత్మ. పరమాత్మ బుద్ధిచే ప్రకాశింప చేయబడునది

కాదు; బుద్ధిని ప్రకాశింప చేయునది. ఇదే విషయము కేనోపనిషత్తులో క్రింద విధముగ చెప్పబడింది. "యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతం" అనగా "మనస్సుచే మననము చేయుటకు వీలుకానిది మరియూ మనస్సుకు మననము చేసేశక్తి దానివలననే సిద్ధించింది. అట్టిది పరమాత్మ" అని. అర్థముఅయితేభగవద్గీత ఆరవ అధ్యాయంలో భగవంతుడు "బుద్ధిగ్రాహ్య మతీంద్రియ" మంటూ చెప్పియున్నాడు. "ఇంద్రియాలకు అందనిది - బుద్ధిచే గ్రహింపబడునది." అని ఆ మాటకు అర్థము. అట్లే కఠోపనిషత్తులోనూ -

"దృశ్యతే త్వగ్ర్యయాబుద్ధ్యా సూక్ష్మయాసూక్ష్మదర్శిభిః" — సూక్ష్మబుద్ధిచేత గ్రహింపబడుతుందని చెప్పబడింది. శ్రీ శంక

రాచార్యులవారు తమ గీతా భాష్యంలో "శమదమాది సంయుక్తను సంస్కృత మనః ఆత్మదర్శనే కరణ", మంటూ సెల విచ్చారు. శ మ ద మా ది షట్సంపత్తితో సంస్కరింపబడిన మ న స్సు ఆత్మను దర్శింప గల్గుతుందంటూ ఆయన మాటకు అర్థము.

భగవద్గీతలో - కఠోపనిషత్తులో భాష్య కారులైన శ్రీ శంకరాచార్యుల మాటలలో "బుద్ధి ఆత్మను గ్రహింపగల్గుతుం" దంటూ చెప్పబడింది. విచారసాగరంలో - కేనోప నిషత్తులో "బుద్ధి ఆత్మను గ్రహింపజాల" దని చెప్పడం జరిగింది. విరుద్ధ ప్రసం గాలకు సమన్వయ మేలాగ ?

అంతర్ముఖమైన శుద్ధబుద్ధికి ఆత్మదర్శ నము సాధ్యమని భగవద్గీతలోని - కఠోప

నిషత్తులోని శ్రీశంకరాచార్యులవారి మాటల లోని అభిప్రాయము బహిర్ముఖమైన మలిన బుద్ధికి సాధ్యముకాదంటూ విచారసాగర-కేనోపనిషత్తుల తాత్పర్యము. ఆ అంతర్ముఖమైన శుద్ధబుద్ధికూడా వృత్తివ్యాప్తితో ఆత్మను ప్రకాశింపజేస్తుంది. ఫలవ్యాప్తితో కాదు. దీపము తన ప్రకాశంతో వస్తువును చూపునట్లు బుద్ధి ఆత్మను తెలియ జేయలేదు. ఆ విధంగా తెలియజేసే పక్షంలో పరమాత్మ పరప్రకాశ్యమైతుంది. జడ వస్తువు కావలసివుంటుంది. అందువలన వృత్తివ్యాప్తితోనే బుద్ధి ఆత్మను ప్రకాశింప జేస్తుంది. ఫలవ్యాప్తితోకాదు -

ఫలవ్యాప్తి అంటేయేమి? ఫలము అంటే చిదాభాసుడని అర్థము. చిదాభాసునిద్వారా తెలియబడుట ఫలవ్యాప్తి. దాని ప్రకార

మేమంటే- బుద్ధివృత్తి నేత్రేంద్రియంగుండా బైటికి ప్రసరించి విషయము వరకుపోయి ఆ విషయాన్ని ఆవరించిన తూలావర ణాన్ని భంగంచేస్తూంది. ఆపై ఆ వృత్తి యందుండే చిదాభాసుడు ఆ వస్తువును ప్రకాశింప (తెలియ) జేస్తాడు. ఆవరణ భంగముచేయుట వృత్తియొక్క పని. వస్తు వును ప్రకాశింపజేయుట చిదాభాసుని పని.

ఉదాహరణం వినండి! ఇదొక్క గడి యారం. ఈ గడియారాన్ని చూడాలనే వృత్తి గడియారం వరకుపోయి గడియా రాన్ని ఆవరించిన తూలావిద్యను భంగం చేసింది. చిదాభాసుడు గడియారాన్ని తెలియజేశాడు. తెలుసుకోవటమనే పని

చిదాభాసుని ద్వారా జరుగుతుంది. ఇదే ఫలవ్యాప్తి.

వృత్తివ్యాప్తి అంటేయేమి? బుద్ధివృత్తి వస్తువుయొక్క సమీపానికి వెళ్ళి వస్తువును ఆవరించిన ఆవరణాన్ని భంగపరచిన తర్వాత ఆ వస్తువు స్వయంప్రకాశం కావడంతో చిదాభాసునితో పనిలేక అదియే స్వయంగా ప్రకాశిస్తుంది.

దానికొక ఉదాహరణము - ఒక రత్నం పై కుండను మూసివున్నారు. ఆ లోపలి రత్నాన్ని చూడాలంటే పై కుండను పగుల కొట్టాలె. కుండ అనే ఆవరణం తొలిగితే లోపలి రత్నం తెలియబడేందుకు వేరొక ప్రకాశంతో పని లేదు. రత్నమే కాక వేరే వస్తువే అయితే దానిని తెలుసుకొనేందుకు ప్రకాశమో - దీపమో పనిబడి వుండేది.

రత్నం కావడంతో అదే ప్రకాశమై ప్రకాశిస్తుంది.

అట్టే సద్గురు కృపకు పాత్రుడై తత్త్వమస్యాది మహావాక్యాలను శ్రవణం చేసిన జిజ్ఞాసువుయొక్క అంతఃకరణంలో "అహం బ్రహ్మాస్మి" అనే వృత్తి సంభవిస్తుంది. ఆ వృత్తి స్వరూపాన్ని ఆవరించిన అజ్ఞానాన్ని నివారిస్తుంది. స్వరూపమైన ఆత్మ స్వయంప్రకాశం కావడంతో దాన్ని ప్రకాశింపజేసేందుకు చిదాభాసునితో పనిలేదు. సూర్యుని ప్రకాశంలో దీపంతో పని లేదు గదా! ఇదే వృత్తి వ్యాప్తి. ఫలవ్యాప్తితో కాదు కాని, బుద్ధి తన వృత్తి వ్యాప్తితో ఆత్మను తెలుసుకొంటుంది అని చెప్పే ఈ మాటకూడా ఉపచారానికి చెప్పిన మాటే ఎట్లంటే —

ఒక ధనవంతుడు తన వంటవానిని "అన్నదాతా – అన్నదాతా" అంటూ ప్రేమతో పిలుస్తూంటాడనుకొండి. నిజంగా చూస్తే తానే అన్నదాత. వంటవానిని అన్నదాత అని పిలవడం ఉపచారానికి మాత్రం.

చేతన స్వరూపమైన ఆత్మ తన్ను తానే తెలుసుకోవాలి కాని, జడమైన బుద్ధితో తెలియబడుతుందా? శుద్ధ బుద్ధి వృత్తి వ్యాప్తి ద్వారా ఆవరణభంగం జరుపుతుంది. ఆత్మ తన్ను తానే తెలుసుకొంటుంది. ఆవరణ భంగం కల్గించే ప్రయోజనమాత్రంతో శుద్ధబుద్ధి ఆత్మను తెలుసుకొంటుందని – మలినబుద్ధి తెలుసుకోజాలదని చెప్పడం జరిగింది.

"మతినలక్షై జిహి మతిలక్షై" - స్వయం ప్రకాశము అనే ఈ లక్షణము యెందుకు చెప్పబడిందంటారు? పరమాత్మ నామ రూపాధారమనే లక్షణంలోని అతివ్యాప్తిని నివారించేకోసం చెప్పబడింది. కల్పిత సర్పముయొక్క నామరూపాలకు ఆధారము త్రాడు. నామరూపాధారము అనే లక్షణము ఆ త్రాటియందుకూడా వర్తించింది. ఆ అతివ్యాప్తిని నివారిస్తూ స్వయం ప్రకాశమనే లక్షణం వెంటనే చెప్పబడింది. త్రాటియందు నామరూపాధారమనే లక్షణం ఘటిస్తే ఘటించనీ కాక - స్వయంప్రకాశ మనే లక్షణం సరిపోదు. త్రాడు జడం కాబట్టి వాస్తవానికి విచారిస్తే కల్పిత సర్పముయొక్క నామరూపాలకు త్రాడు ఆధారమనుటకూడా మందబుద్ధుల నుద్దే

శించి చెప్పిన మాట. కల్పితసర్పానికి రజ్జు ఉపహితచేతనమే ఆధారము కాని రజ్జువు కాదు. ఈ విధంగా నామరూపాధారమనే లక్షణం కాని – స్వయం ప్రకాశమనే లక్షణం కాని - చేతనవస్తువునందే సంభ వించింది కాని - జడవస్తువులందు కాదు.

పరమాత్మ పరబ్రహ్మము స్వయం ప్రకాశము అని అయిదవ లక్షణాన్ని చెప్పాము. ఇక్కడా ఒక దోషం వుంది. ఉపాసకుల మతంలో ఉపాసకుడు తాను ఉపాసించే ఉపాస్యదైవమును స్వయం ప్రకాశమనియే తలుస్తాడు. నిజం విచారిస్తే ఉపాసనకు అధీనమైన వస్తువు త్రిపుటి లోకి అంతర్గూతం కాబట్టి అది స్వయం ప్రకాశం కాలేదు. అయినా ఆ ఉపాసకులు తమ ఉపాస్యదైవాన్ని స్వయంప్రకాశ

మని భావిస్తారు. ఈ విధంగా ఈ లక్షణం పరబ్రహ్మమునందు ఉపాసకుల ఉపాస్య దైవంనందూ రెండు చోట్లా ప్రవర్తించింది. కాబట్టి ఈ లక్షణానికి అతివ్యాప్తిదోషం పట్టింది. కాబట్టి ఆ అతివ్యాప్తిని నివారించే కోసం —

6. పరబ్రహ్మము స్వయంప్రకాశమూ శుద్ధమునూ — అనే ఆరో లక్షణం చెప్ప బడింది. ఉపాసకుడు ఉపాసించు దేవత సగుణం కావడంతో అవిద్యాది మలాలతో కూడి వుంది. కాబట్టి అది శుద్ధం కాదు. పర మాత్మ అని పరబ్రహ్మమని చెప్పబడే ఆత్మ అవిద్యాది మల సంబంధంలేని శుద్ధస్వరూ పము. "శుద్ధం అపాపవిద్ధం" అని శ్రుతి పల్కింది.

పరమాత్మ శుద్ధము అని ఒక మాట చెప్పి వూరకుంటే ఇక్కడా ఒక అతి వ్యాప్తి వస్తుంది. ఏమంటే – సాంఖ్య మతస్తులు తాము చెప్పే ఆత్మశుద్ధమనే చెప్తారు. ఆ మాటనే మనమూ చెప్తితే యిద్దరి సిద్ధాంతాలు ఒకటేనా అనే శంక వస్తుంది. అందుకోసం నిశ్చలదాసుగారు శుద్ధము అని చెప్పి వెంటనే అపారము అని చెప్పారు.

7. పరమాత్మ శుద్ధము మరియు అపారము; ఈ విధంగా ఏడవ లక్షణం చెప్పబడింది. సాంఖ్యులు ఆత్మను శుద్ధమని చెప్పినప్పటికీ అపారమని మాత్రము చెప్పరు.

అపారమని అంటే పరిచ్ఛిన్నముకానిది – అంతము లేనిది అని అర్థము. దేశ

గత పరిచ్ఛేదము కాలగత పరిచ్ఛేదము - వస్తుగత పరిచ్ఛేదము - ఈ విధంగా త్రివిధ పరిచ్ఛేదాలు లేనిది కాబట్టి ఆత్మను అపార మని అన్నారు. సాంఖ్యులు తాము చెప్పే ఆత్మకు దేశగత పరిచ్ఛేదము - కాలగత పరిచ్ఛేదము లేదని చెప్పినప్పటికీ వస్తుగత పరిచ్ఛేదం వుందనే చెప్తారు. మనవాళ్లు మూడు పరిచ్ఛేదాలు లేవని అంటారు.

కుండ ఈ ప్రదేశమందుంది. ఆ ప్రదేశంలో లేదు. ఈ దేహము వీధిలో వుంటే యింట్లో లేదు; యింట్లో వుంటే వీధిలో లేదు. ఈ కుండ కాని, ఈ దేహం కాని, దేశగత పరిచ్ఛేదం కల్గివుంది. పరబ్రహ్మము అలా కాదు. దేశమనేది బ్రహ్మమునందు కల్పింపబడింది. సర్వ దేశములకు బ్రహ్మమే అధిష్ఠానము. "అస్తి" శబ్దమునకు అర్థము

ఉన్నదనే మాటకు అర్థము బ్రహ్మమే అయి నప్పుడు ఉండేదంతా అదే అయివున్న ప్పుడు అది లేని చోటెక్కడని! కాబట్టి పర బ్రహ్మానికి దేశగత పరిచ్ఛేదంలేదు.

రెండవది కాలగత పరిచ్ఛేదం. ఈ కుండ సంవత్సరం క్రితం లేదు. ముందు సంవత్సరానికి వుండదు. ఈ దేహం యాభై యేండ్ల క్రితం లేదు. ఇక కొన్నా ళ్లకు వుండదు. ఈ రెంటికీ కాలగత పరి చ్ఛేదం వుంది. ఏ వస్తువు కానీ కాక పుట్టక .ముందు వుండదు. నశించినతర్వాత లేదు ప్రతిదీ కాలగత పరిచ్ఛేదం కల్గివుంది. పరబ్రహ్మము ఉత్పత్తి నాశాలు లేనిది. కాలము దానిలో కల్పింపబడిన పదార్థము కాలానికి పరబ్రహ్మమే అధిష్ఠానము.

కాబట్టి పరబ్రహ్మానికి కాలగత పరిచ్ఛేదం లేదు.

మూడోది వస్తుగత పరిచ్ఛేదము. ఘటము పటము కాదు; పటము ఘటము కాదు. ఈ ఘట పటాలకు వస్తుగత పరిచ్ఛేదం వుంది. అఖండ సర్వవ్యాపక పరబ్రహ్మంలో వస్తువులన్నీ కల్పింపబడ్డాయి. అన్ని వస్తువులకు అధిష్ఠానము పరబ్రహ్మము. కాబట్టి ఆ పరబ్రహ్మానికి వస్తుగత పరిచ్ఛేదం లేదు. ఈ విధంగా త్రివిధ పరిచ్ఛేద రహితం కాబట్టి పరబ్రహ్మము అపారమని చెప్పబడింది.

ఈ విధంగా సుఖమూ నిత్యమూ, నిత్యమూ ప్రకాశమూ, ప్రకాశమూ విభువూ, విభువూ నామరూప ఆధారము, నామరూప ఆధారమూ స్వయంప్రకా

శమూ, స్వయంప్రకాశమూ శుద్ధమూ, శుద్ధమూ అపారమూ - అని యేడు లక్షణాలతో చెప్పబడిన ఆ పరబ్రహ్మము "సోహం" "సోహం" అదియే నేను. ఇది నిర్గుణ బ్రహ్మవస్తునిర్దేశ రూపమైన మంగళాచరణము.

జీవబ్రహ్మైక్య రూపమైన మంగళాచరణంతో ప్రారంభించి శ్రీ నిశ్చలదాసు గారు గ్రంథస్థ విషయము అద్వైతమంటూ చెప్పకనే చెప్పేశారు. ఇంటి ముంగిలి అలికి ముగ్గువేసివుంటే ఆ యిల్లు హిందూ గృహమని చెప్పకనే తెలుసుకోవచ్చు. ఆ విధంగానే ఈ మంగళాచరణము గ్రంథములోని విషయము అద్వైతమంటూ తెలుపకనే తెల్పింది.

ఈ మంగళాచరణాన్ని ఒకడు విన్నాడు. అతడు శ్రీ నిశ్చలదాసుగారిని ఈ విధంగా ప్రశ్నిస్తూన్నాడు.

ప్రస్థానత్రయంలో బోధింపబడిన విషయాలే యీ విచారసాగర గ్రంథంలో బోధింపబడినవి. ప్రస్థానత్రయాల ఆధారం లేని గ్రంథము గ్రంథమని అనిపించుకోదు. అట్టిదానిని పండితులు ఒప్పుకోరు. ఈ గ్రంథము రచించి 3-4 వందల సంవత్సరాలైంది. అప్పటినుండి యిప్పటివరకు యెందరో ముముక్షువులు యీ గ్రంథాన్ని పఠించి అపరోక్షసిద్ధిని పొందారు, ధన్యులైనారు.

ఇంతవరకు జీవబ్రహ్మలు వేరుకాదని ఒక్కటేనని అభేదం చెప్పబడింది. ఆ మాటను ద్వైతసంస్కారంకల ఒక వ్యక్తి

విన్నాడు. ఈ విధంగా శంకిస్తూన్నాడు.

"స్వామీ! మీరు చేసిన మంగళాచరణము అశాస్త్రీయంగానూ అసభ్యంగానూ వుంది. మంగళాచరణం చేసేందుకు మన మతంలో యెందరో దేవతలుండగా మీకు మీరే మంగళాచరణం చేసుకోవడం తన పాదాలకు తానే నమస్కారం చేసుకొన్నట్లు, తన భుజాలను తానే తట్టుకొన్నట్లున్నది. ఇది నాస్తికపద్ధతిగా వుంది కాని సమంజసంగా లేదు."

ఈ శంకను విని నిశ్చలదాసుగారు పూర్వపక్షికి సమాధానం చెప్పుతూన్నారు.

"అబ్ధి అపార స్వరూపమమ
లహరీ విష్ణుమహేశ్ ।
విధి రవిచంద్రావరుణయమ
శక్తి ధనేశ గణేశ్ ॥

"అయ్యా! విను. నా స్వరూపము సముద్రమువలె అపారమైనది. ప్రతివాడు స్త్రీలు పురుషులు చిన్నలు పెద్దలు నేను నేనని అంటూన్నారే – ఆ నేనుయొక్క స్వరూపం యేమని భావించావు? అది సదా వుండునది. త్రికాలా బాధ్యమైంది. దేహాదులకు అంతమున్నది. కాని దానికి లేదు. కాబట్టే అది సముద్రమువలె అపారమని చెప్పబడింది."

"స్వామీ! నా స్వరూపమైన ఆత్మ సముద్రమువలె అపారమని చెప్పితిరి. సముద్రానికి పారమున్నదికదా! పడవలతో స్టీమర్లతో దాటివేస్తూన్నాముకదా! అది అపారమెట్లయితుంది? ఆత్మకూడా అంతేనా!"

"అయ్యా! ఆత్మ విషయంలో సముద్రాన్ని దృష్టాంతం చెప్పాను. దృష్టాంతం ఏకదేశీయంగానే కానీ సార్వదేశీయంగా సరిపోదు. 'దేవదత్తుడు సింహము' అని అంటాము. సింహము అనే దృష్టాంతంలో పరాక్రమమనే ఒక్క అంశాన్నే గ్రహించాలె. సింహమైతే 'జూలు లేదే తోక లేదే' అని అడగరాదు. అట్లే యిక్కడ సముద్ర దృష్టాంతం గ్రహించాలె. ఎంత చూచినా సముద్రానికి అంతు దొరకదు. ఎన్ని నదులు వచ్చిపడినా తనలో లీనం చేసుకొంటుంది. అది అపారం.

సముద్రంలో తరంగాలనేకమున్నాయి. ప్రతిఒక్క అలకూ నమస్కారం చేయాలంటూ కోటి జన్మలెత్తినా తీరేపనికాదు. అట్లే నా స్వరూపమనే సముద్రంలో

కోటానుకోట్లు తరంగాలున్నాయి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే త్రిమూర్తులు సూర్య చంద్రులు యమ వరుణాది దిక్పాలకులు శక్తి వినాయకాదులు నా స్వరూపమైన చైతన్య సముద్రంలో అలలుగా వున్నారు. విడివిడిగా మంగళాచరణం చెయ్యాలంటే ఎన్ని జన్మలు చేసినా పూర్తికాదు. ఒక రికి చేస్తే మరొక్కరికి కొరతే వుంటుంది. నా స్వరూపానికి మంగళాచరణం చేస్తే ఒక్కేసారి తరంగాలవంటి దేవత లందరికి పూర్తిగా చెందినట్లయితుంది. అందువలన స్వరూప మంగళాచరణమే శ్రేష్ఠమైంది."

"స్వామీ! నీవుచెప్పిన బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతలు సగుణ బ్రహ్మమని చెప్పబడే మాయోపాధికుడైన యీశ్వరుని

యందు అలలవంటివారు కాని నీ స్వరూపమునందు అలలుకాదు. ఆ యీశ్వరునికి నమస్కరిస్తే అందరికి ముట్టినట్లయితుంది. అల్పమైన నీ స్వరూపానికి మంగళాచరణం చేస్తే అది సరిపోదు. మాయోపాధికుడైన యీశ్వరునిగురించి మంగళాచరణం చేయాలిసుమా!" అని పూర్వపక్షి ఆక్షేపించాడు. దానికి సమాధానం నిశ్చలదాసుగారు చెబుతూన్నారు.

"అయ్యా! నీవు నా స్వరూపమంటే యేమో యీశ్వరుడంటే యేమో యెరుగక మాట్లాడ్తూన్నావు. బ్రహ్మచైతన్యము మాయయందు ప్రతిబింబించి ఆ ప్రతిబింబమునే యీశ్వరుడని చెప్పుతూన్నారు. ఆమాయోపాధి శుద్ధమైంది కాబట్టి యీశ్వరునికి బంధం-ఆవరణం కల్గించలేదు. కాబట్టే

ఆయన సర్వజ్ఞుడని అనిపించుకోగలిగాడు. నా స్వరూపము బ్రహ్మస్వరూపము. అది బింబము. ఆ బింబమునందు ప్రతిబింబమైన యీశ్వరుడు కల్పింపబడినాడు - విను"

"జా కృపాలు సర్వజ్ఞకో
హియ ధారత మునిధ్యాన్।
తాకోహోత ఉపాధితై
మోమైఁ మిథ్యాభాన్॥"

"అయ్యా! మునీశ్వరులగువారు కృపాళువు సర్వజ్ఞుడు అయిన యే యీశ్వరుని తమ హృదయాలలో ధ్యానం చేస్తూంటారో ఆ యీశ్వరుడు కూడ నా స్వరూపంలో కల్పింపబడినవాడే."

తమ స్వరూపము పరబ్రహ్మ స్వరూపమని యెరుగక మాయోపాధికుడగు యీశ్వరుని హృదయంలో ధ్యానించేవారు

మునులని చెప్పబడ్డారు. ఆ యీశ్వరుడు కృపాలువని చెప్పబడ్డాడు. దీనహీనుల హితమే తన హితమని వారి యోగక్షేమములను వహించేవాడు కాబట్టి కృపాలుడని చెప్పబడ్డాడు.

"మునిజనులచే ఉపాసింపబడే యీశ్వరుడు నా స్వరూపమునందు కల్పింపబడినాడు. అట్టి యీశ్వరునికీ అధిష్ఠానమైన నా స్వరూపానికి మంగళాచరణం చేయుట అన్నివిధాల యోగ్యమైవుంది."

ఉపాధి వుండేవరకు ప్రతిబింబం వుంటుంది. ఉపాధి ఆగంతుకం కాబట్టి ప్రతిబింబంకూడా మిథ్యే. బింబం నిజం. బింబానికి చేసిన పూజ ప్రతిబింబానికి చెందినట్లే. బింబానికి బొట్టుపెడ్తే ప్రతి

బింబానికి పెట్టినట్లే బింబానికి పూల దండ వేస్తే ప్రతిబింబానికి వేసినట్లే.

ఒక బాలకుడు తన నీడను చూచి ఇంకొక బాలకుడని తలంచి ఆ తలను పట్టుకొనేందుకు ప్రయత్నించాడు. నీడ తల అందకపోయేసరికి యేడ్వడం మొదలు పెట్టాడు. తల్లి వచ్చి వాని చేతులతో వాని తలనే పట్టించింది. బింబాన్ని పట్టుకొంటే ప్రతిబింబాన్ని పట్టుకొన్నట్లే అయింది.

శ్రీ రమణమహర్షులవారి సన్నిధికి గుజరాతీ దేశమునుండి ఒక భక్తుడు వచ్చి శ్రీ స్వాములవారితో యీలాగా అన్నాడు. "స్వామీ! ఈశ్వరుడు మమ్ము సృష్టించాడు. జగత్తును సృష్టించాడు. ఆయన మహిమే యిదంతా." అంటూ యేమేమో

ప్రసంగం మొదలుపెట్టాడు. ఆయన నవ్వి "పిచ్చివాడా! ఏమంటున్నావు! ఈశ్వరుడు నిన్ను సృష్టించాడా? నీవు యీశ్వరుని సృష్టించావా? విచారించి చెప్పు" మంటూ అన్నాడు. దాని అర్థమేమి? ఈశ్వరుడు సృష్టించునది దేహము. నీవు దేహము కాదు. బ్రహ్మస్వరూపమైన ఆత్మవు. ఆ యీశ్వరునికీ అధిష్ఠానమైన ఆత్మే నీవని తెలుసుకొమ్మంటూ సూచన. కాబట్టే నా స్వరూప మంగళాచరణం యోగ్యమేకాని అయోగ్యం కాదని చెప్పినాను.

ఈ మాటవినిన పూర్వపక్షి మరోశంకను ప్రారంభించాడు.

"అయ్యా! నీవు చెప్పునది సరిగాలేదు. ఎందుకనిన - మాయోపాధికుడైన యీశ్వ

రుడు నిర్గుణ పరబ్రహ్మంలో కల్పితుడు కాని అల్పమైన నీ స్వరూపంలో కల్పితుడు కాదుకదా! నిర్గుణ పరబ్రహ్మంయొక్క మంగళాచరణంచేస్తే యీశ్వరునికి ముట్టుతుంది కాని నీ మంగళాచరణంతో కాదు కదా!"

ఈ శంకను నివారిస్తూ నిశ్చలదాసు గారు సమాధానం చెప్పుతూన్నారు.

"హైృ జిహిజావై బిన జగత
మనహుజేవరీసాంప్।
నసై భుజగ జగ జిహిలహై
సోహం ఆపే అప్॥"

"త్రాడును త్రాడుగా తెలియక పోవడంతో పాము కానొచ్చింది. త్రాటిని తెలుసుకోగానే పాము కల్పితమైపోయింది. తన్ను పరబ్రహ్మముగ తెలియని అజ్ఞాన

దోషంతో జగజ్జీవేశ్వరులు తోచారు. అధిష్ఠాన బ్రహ్మమును స్వరూపంగా యెరిగినపుడు యీశ్వరుడు నా స్వరూపంలో కల్పితుడయ్యాడు. జగత్తూ బాధింపబడింది. ఈశ్వరుడూ బాధింపబడ్డాడు. ఆ నిర్గుణ పరబ్రహ్మమే నా స్వరూపము. కాబట్టి స్వరూపానికి మంగళాచరణంచేస్తే సమస్త మంగళాచరణములు సిద్ధించినట్లే అయితుంది. కాబట్టి నేను చేసిన మంగళాచరణము అశాస్త్రీయంకాదు. అయోగ్యం కాదు."

ఈ శ్లోకంలో చివర ప్రయోగించిన "ఆ పేఆప్" (తానే తాను) అను పదము సంపూర్ణంగా పరతంత్రాన్ని నిరసించి స్వతంత్రాన్ని స్థాపిస్తూంది. అటుగాక ఆయనా వున్నాడు; నేనూ వున్నానంటూ

అర్థంచెప్తే మూడువిధాలైన పరతంత్రాలు యేర్పడ్తాయి,

మొదటిది అంశాంశిభావం. పరమేశ్వరుడు అంశియని తాను అంశమని భావించడం. అంశము అంశికి అధీనమై వుండాలె. రెండవది వికార వికారి భావం. భగవంతుడు కారణమని తాను కార్యమని భావించడం కార్యము కారణానికి అధీనమై వుండాలె. మూడవది ఉపాస్య ఉపాసక భావము. పరమాత్మ ఉపాస్యుడని తాను ఉపాసకుడని భావించడం. ఉపాస్యుడు ఉపాసకునికి అధీనమై వుండాలె. ఈ మూడు విధాలైన పరతంత్రాలు తొలగాలె అంటే అతడే తానై పోవాలె. సర్వాధిష్ఠాన బ్రహ్మము తానైనప్పుడు అభేదాలకు

తావులేదు. కాబట్టి స్వరూప మంగళా చరణం సర్వశ్రేష్ఠమైంది.

ఈ సమాధానం విన్నతర్వాత పూర్వ పక్షి మరో ఆక్షేపణను తెచ్చిపెట్టాడు.

"స్వామీ! ఎంతవారైనా వారివారి సంప్రదాయాన్ని అనుసరించి ఆయా యిష్ట దేవతకు నమస్కరించడం పూజించడం వుంది. మీ సంప్రదాయం దాదూ సంప్ర దాయం. ఆ సంప్రదాయస్థులు శ్రీరామ చంద్రుని యిష్టదైవంగా భావిస్తారు. సంప్ర దాయ మర్యాద నెరిగిన నీవు శ్రీరామ చంద్రుని గురించి మంగళాచరణం చేయక నీ స్వరూపానికి మంగళాచరణం చేశా వేమిటి?"

"నాయనా! నీ ఆక్షేపణ బాగానేవుంది. ఆత్మజ్ఞానాన్ని అపేక్షించే మా సంప్రదా

యస్థులు శ్రీరామచంద్రుని ఆరాధించేవారే. కానీ వారు యేవిధంగా ఆరాధిస్తారో తెలుసా! ఆత్మకు అభిన్నంగా ఆరాధిస్తారు. హృదయ కమలంలో ఆత్మరూపుడై రమించే వాడే రాముడు.

"బోధచాహి జాకోసుకృతి
భజతరామ నిష్కామ్
సో మేరోహై ఆత్మా
కాకూ కరూ ప్రనామ్॥"

"సర్వారాధ్యుడైన శ్రీరాముడు నా ఆత్మస్వరూపి సచ్చిదానంద స్వరూపుడు. ఆయన నా స్వరూప మయ్యేవుంటే నే నెవ్వరికి ప్రణామం చెయ్యాలె? "కాకూ కరూ ప్రణామ్" నాకంటె భిన్నమైనది జడదృశ్య ప్రపంచం. దానికి నమస్క రించాల్నా? సత్యవస్తువు నా స్వరూపమే

అయిపోయె. మిథ్యావస్తువులకు నమస్కారం చేయాల్నా? శ్రీరాముడు ఆత్మకంటె భిన్నమైతే అనాత్మ అయిపోతాడు. అనాత్మ వస్తువులు జడములు దృశ్యాలు దృశ్యమైనది నశించి తీర్తుంది.

కాబట్టి స్వరూప మంగళాచరణంలో అన్నివిధాలైన మంగళాచరణాలు చేరుకొన్నట్లే. ఇది దూషణంకాదు; పైపెచ్చు భూషణమయ్యేవుంది. నీ యిష్టదైవం నీ స్వరూపానికంటె భిన్నంకాదు. ఆ విధమైన అభిన్న దృష్టితో మంగళాచరణంచేసి ధన్యుడివికా!"

సమాప్తము

★

శ్రీ వేదవ్యాస ప్రెస్, చిత్తూరు.

మా ప్రచురణలు.

1.	ఆంజనేయదండకము - నామావళి	0—10
2.	గీతా సంకీర్తనము	0—12
3.	గండిక్షేత్రం దృశ్యాలు	0—10
4.	గీతామూలము	అచ్చులో
5.	వేదాంతభేరి (పద్యము)	0—15
6.	గురుపూజ	0—15
7.	గీతాతాత్పర్య ప్రదీపము	1—75
8.	మాగండిక్షేత్రము	0—50
9.	ఆశ్రమ సమీక్ష	0—12
10.	మూడు గుణాలు	0—19
11.	గీతానుష్ఠాన పద్ధతి	0—50
12.	శ్రీ మదాంధ్ర భగవద్గీత	1—00
13.	స్థూలాక్షరీ భగవద్గీత (మూలము)	1—50
14.	హనుమాన్ చాలీసా	0—10
15.	మంగళాచరణము	0—40
16.	అధ్యాత్మయోగము	0—25

దొరుకుచోటు :—

శ్రీ భూమానందాశ్రమము,

వీరన్నగట్టుపల్లె పోస్టు, కడపజిల్లా.